సాక్షి సూర్యాపేట

గురువారం । 14 । డిసెంబర్ । 2023



వివేకానందుడి జీవితాన్ని..
వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని రామకృష్ణ మఠం సంస్థ ఉపాధ్యక్షుడు నాగేశ్వరావు అన్నారు. - 10లో



మట్టపల్లిలో నిత్య కల్యాణం
మట్టపల్లి దేవాలయంలో లక్ష్మీనృసింహ స్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చ కులు వైభవంగా నిర్వహించారు. - 10లో



భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి
విద్యార్థులు సమస్యలపై ప్రయోగాలు చేసి భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని నల్లగొండ కలెక్టర్ కర్ణన్ ఆకాంక్షించారు. - 10లో

ఎంపీ టికెట్‌కు పోటీ!

- కాంగ్రెస్ నుంచే ఎక్కువ మంది ఆశావహులు
- అధిష్టానం ఆదేశిస్తే పోటీలో ఉంటానన్న జానారెడ్డి
- భువనగిరి టికెట్ ఆశిస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లోనూ పోటీపడుతున్న నేతలు
- నల్లగొండ టికెట్ రేసులో ముందున్న గుత్తా అమిత్
- బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న బండారు ప్రసాద్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో పార్లమెంట్ స్థానాల్లో పోటీపై రాజకీయవర్గాల్లో చర్చ జోరందుకుంది. మరో మూడు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో మూడు ప్రధాన పార్టీల్లో ఎంపీ టికెట్ల కోసం ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించడంతో ఆ పార్టీ నుంచి ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. సీనియర్ నేతలతో పాటు ముఖ్య నేతలు కూడా ఎంపీ టికెట్‌పై దృష్టి పెట్టారు. ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడంతో ఎంపీ టికెట్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ముఖ్యుల నుంచి హామీ పొందిన నేతలు కూడా టికెట్ ఆశిస్తున్నారు.

మనసులో మాట బయటపెట్టిన జానారెడ్డి

నాగార్జునసాగర్ ఎన్నికల బరి నుంచి తప్పుకొని, తన కుమారుడికి టికెట్ ఇప్పించుకున్న పార్టీ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే తన మనసులో మాట బయట పెట్టారు. పార్టీ ఆదేశిస్తే తాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తానని పేర్కొన్నారు. రాజకీయాల నుంచే తప్పుకుంటానని చెప్పిన ఆయన ఈ మాట చెప్పడం చర్చనీయాంశంగా మారింది. మూడు రోజుల క్రితం.. సీఎం రేవంత్‌రెడ్డి తన ఇంటికి వచ్చి వెళ్లిన తరువాత కూడా జానారెడ్డి ఇదే మాట చెప్పారు. దీంతో ఈసారి ఆయన పోటీలో ఉంటారన్న చర్చ సాగుతోంది. ఆయన పెద్ద కుమారుడు కుందూరు రఘువీర్‌రెడ్డి కూడా ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. ఈ ఇద్దరిలో ఎవరు బరిలో ఉంటారన్నది చర్చనీయాంశంగా మారింది.

పటేల్ రమేష్‌రెడ్డికి హామీ..

సూర్యాపేట అసెంబ్లీ టికెట్‌ను సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి ఇచ్చిన సమయంలో అక్కడి నుంచి టికెట్ ఆశించిన పటేల్ రమేష్‌రెడ్డికి అధిష్టానం స్పష్టమైన హామీ ఇచ్చింది. నల్లగొండ లేదా భువనగిరి ఎంపీ టికెట్ ఇస్తామని కేసీ వేణుగోపాల్ కూడా ఆయనకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రమేష్‌రెడ్డికి ఎంపీ టికెట్ కాకుండా రాష్ట్ర ప్రభుత్వంలోనే ఏదైనా పదవి ఇస్తారన్న చర్చ సాగుతోంది.

బీఆర్‌ఎస్ నుంచి ఇద్దరు ఆశావహులు

నల్లగొండ ఎంపీ స్థానానికి బీఆర్‌ఎస్ నుంచి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన మునుగోడు టికెట్ ఆశించారు. అయితే అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేకే టికెట్ కేటాయించడంతో అమిత్‌కు లోక్‌సభ టికెట్ ఇస్తారన్న చర్చ సాగింది. మరోవైపు వ్యాపారవేత్త నరేందర్‌రెడ్డి కూడా అప్పట్లో నల్లగొండ ఎంపీ టికెట్ ఆశించారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో మాజీ సీఎం కేసీఆర్ ప్రచార సభల్లోనూ ఆయన పాల్గొన్నారు.

కమలం దళం నుంచి ప్రసాద్

బీజేపీ నుంచి నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు ప్రసాద్‌కు గతంలోనే పార్టీ హామీ ఇచ్చిందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట నుంచి పోటీ చేసి ఓడిపోయిన సంకినేని వెంకటేశ్వర్‌రావుతోపాటు ఒకరిద్దరునేతల పేర్లు కూడా పార్టీ ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది.

భువనగిరి స్థానంపై యువనేతల దృష్టి

భువనగిరి ఎంపీ టికెట్ రేసులో సీఎం రేవంత్‌రెడ్డి అనుచరుడు, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్నీ తానై తుంగతుర్తిలో మందుల సామేల్ గెలుపు కోసం పనిచేశారు. తాను ఎంపీగా పోటీ చేస్తానన్న విషయాన్ని కూడా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఎంపీ టికెట్ ఇస్తారన్న చర్చ సాగుతోంది. అయితే, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మిని పోటీలో దింపుతారనే చర్చ కూడా సాగుతోంది. మరోవైపు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కుమార్తె కీర్తిరెడ్డి కోసం టికెట్ అడుగుతున్నట్లు తెలిసింది. ఇక బీఆర్‌ఎస్ నుంచి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని బరిలో నిలుపుతారనే చర్చ సాగుతుండగా, బీసీకి ఇవ్వాల్సి వస్తే జనగామకు చెందిన మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, బూడిద భిక్షమయ్యగౌడ్ పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇక బీజేపీ నుంచి ఆ పార్టీ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

న్యూస్‌రీల్

కోదాడ కోర్టుకు నిధులు మంజూరు చేయించండి



మంత్రి ఉత్తమ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న న్యాయవాదులు

కోదాడ: రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోదాడకు చెందిన న్యాయవాదులు కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కోదాడలో కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి వెంటనే పనులను ప్రారంభించేలా కృషి చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో పగడాల రాంచంద్రారెడ్డి ఉన్నారు.

నేడు కోదాడలో బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

మునగాల(కోదాడ): కోదాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉమ్మడి జిల్లాస్థాయిలో అండర్–14, 17 బాలబాలికల విభాగాల్లో బేస్‌బాల్ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ.ఆజంబాబా తెలిపారు. ఈమేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9గంటల వరకు రిపోర్టు చేయాలని సూచించారు. క్రీడాకారులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలాలని ఆకాంక్షించారు.

గ్యాస్ ఏజెన్సీ దందాపై విచారణకు కలెక్టర్ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కేవైసీ పేరిట చేస్తున్న దందాపై కలెక్టర్ వెంకట్రావు విచారణకు ఆదేశించారు. అలాగే విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)ను నియమించారు. గ్యాస్ కేవైసీ పేరుతో ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తుండడం, కేవైసీ చేయించుకుంటేనే రూ. 500కు సిలిండర్ అంటూ అబద్ధపు ప్రచారం చేయడం, సురక్ష పైపులను బలవంతంగా అంటగడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై 'గ్యాస్ కేవైసీ పేరిట దగా' శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురించిన కథనానికి కలెక్టర్ పైవిధంగా స్పందించారు.

రాష్ట్రపతి రాకకు ఏర్పాట్ల పరిశీలన



పోచంపల్లిలో హెలిపాడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి జిల్లా పోచంపల్లిలో ఈ నెల 20న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ఖరారైన సందర్భంగా బుధవారం స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న సభ ఏర్పాట్లను చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు, అడిషనల్ డీసీపీ రవికుమార్, జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, తహసీల్దార్ వీరాబాయి పరిశీలించారు. సభాప్రాంగణం, చేనేత స్టాల్స్, భద్రతా ఏర్పాట్లను చూశారు. అదేవిధంగా రాష్ట్రపతితో పాటు వచ్చే మొత్తం 3 మిలట్రీ చాపర్‌ల కోసం అవసరమైన హెలిపాడ్ స్థలాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న తాత్కాలిక గొర్రెలమంద పాకలు, చెట్లు, కడీలు, కరెంట్‌తీగలను తొలగించి స్థలాన్ని చదును చేయాలని అధికారులకు సూచించారు. 3 హెలిపాడ్‌లు నిర్మించాలని ఆదేశించారు. అనంతరం రంజనీ హ్యాండ్లూమ్ యూనిట్‌ను సందర్శించారు. వారి వెంట ఆర్‌అండ్‌బీ ఈఈ శంకరయ్య, డీఈ సుగేందర్, ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి, ఎంఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ క్రాంతి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసస్వామి, సీనియర్ అసిస్టెంట్ రాజేశ్ తదితరులున్నారు.

యాదాద్రిలో నిత్యపూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో బుధవారం నిత్యపూజలు విశేషంగా కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం వంటి సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు జరిపించి, సాయంత్రం జోడు సేవను ఊరేగించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

క్రీడలతో దివ్యాంగుల్లో మనోధైర్యం



పరుగు పందెంలో పాల్గొన్న దివ్యాంగులు

సూర్యాపేటటౌన్ : క్రీడలు ఆడటం ద్వారా దివ్యాంగుల్లో మానసికోల్లాసం, మనో ధైర్యం కలుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులు సామాజికంగా, శారీరకంగా, కుటుంబపరంగా వివక్షకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు క్యారంబోర్డ్, చెస్, పరుగుపందెం, షార్ట్‌పుట్, జావలిన్‌త్రో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఈ నెల 15న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ పాల్గొన్నారు.



జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ



దివ్యాంగ క్రీడాకారులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

గ్యాస్ కేవైసీకి చివరి గడువు లేదు

- వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు
- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, హాజరైన అధికారులు, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గ్యాస్ కేవైసీ నమోదుకు చివరి తేదీ అంటూ ఏమీ లేదని, అపోహలను ప్రజలు నమ్మొద్దని జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గ్యాస్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవైసీ పేరుతో వినియోగదారుల్లో అపోహలు సృష్టించి, వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కేవైసీ నమోదు అనేది నిరంతర ప్రక్రియ అని, ఈ విషయాన్ని ఏజెన్సీలు వినియోగదారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. కేవైసీ నమోదు సమయంలో సురక్ష పైపులను బలవంతంగా అంటగట్టవద్దని, అవసరం ఉన్న వారు పైపులను కొనుగోలు చేసుకోవచ్చన్నారు. రూ. 500కు సిలిండర్ సరఫరాపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, కేవైసీ నమోదుకు ఈ పథకానికి సంబంధం లేదని ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ అధికారులు, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

30న జిల్లా కోర్టులో లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లా కోర్టు ప్రాంగణంలో డిసెంబర్ 30న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ కోరారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు, బ్యాంకు సిబ్బంది, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోర్టులో కేసు పరిష్కారం వల్ల ఇరువర్గాల కక్షిదారులు గెలిచినవారు అవుతారన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీపడాలని సూచించారు. చిన్న, చిన్న ఘర్షణలకు కోర్టు మెట్లు ఎక్కకుండా గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు. దీనిద్వారా మనస్పర్థలు వీడి కలిసిమెలిసి జీవించ వచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎన్. అమరావతి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్య యాదవ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, బ్యాంకు పాల్గొన్నారు.

కిట్లు రాలే.. నగదు అందలే

- నిలిచిపోయిన బాలిక ఆరోగ్య రక్ష పథకం
- విద్యార్థులకు అందని కాస్మోటిక్ చార్జీలు



అర్వపల్లిలోని కేజీబీవీ

నాగారం : బాలికా ఆరోగ్య రక్ష పథకంలో భాగంగా కస్తూర్బా విద్యార్థినులకు హైజిన్ కిట్ల పంపిణీ అటకెక్కగా, వాటి స్థానంలో నగదు అందిస్తామన్నా...కాస్మోటిక్ చార్జీలు సైతం విడుదల కావడం లేదు. దీంతో విద్యార్థులు కాస్మోటిక్ చార్జీల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. కరోనా తర్వాత కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో సౌందర్య పోషకాల (కాస్మోటిక్)కు సంబంధించిన డబ్బులు నిలిచిపోవడంతో విద్యార్థులపై నెల నెలా ఆర్థిక భారం పడుతుంది. కేజీబీవీ పాఠశాలలో పేద, మధ్య తరగతికి చెందిన కుటుంబాల పిల్లలే ఎక్కువ ఉన్నారు. దీంతో పాటు తల్లీదండ్రులు లేనివారు కేజీబీవీల్లో చదువుకుంటున్నారు. గత విద్యా సంవత్సరం మొదట్లో కిట్లకు బదులుగా నెలకు ఒక్కో విద్యార్థికి రూ.100 చొప్పున 10 నెలలకు రూ.1000 చెల్లిస్తామన్న విద్యాశాఖ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా కాస్మోటిక్ చార్జీలు చెల్లించ లేదు.

3341 మంది విద్యార్థులు...

జిల్లాలో 18 కేజీబీవీ పాఠశాలలు ఉండగా వీటిలో పాఠశాల, ఇంటర్ విభాగంలో మొత్తం 3,341 మంది విద్యార్థులు చదువుతున్నారు. బాలికల సంరక్షణకు 2018లో బాలికల ఆరోగ్య రక్ష పథకాన్ని అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా విద్యార్థుల ఆరోగ్యం కోసం హైజిన్ కిట్లను అందజేశారు. ఆ కిట్లలో కొబ్బరి నూనె, రెండు రకాల సబ్బులు, షాంపూ, పేస్ట్, బ్రష్, టంగ్ క్లీనర్, పౌడర్, దువ్వెన, రిబ్బన్‌లు, శానిటరీ న్యాప్‌కిన్లు, బొట్టుబిళ్లలు వంటి ఉన్నాయి. ఒక్కో బాలికకు మూడు నెలలకు ఒక కిట్ చొప్పున ఏడాదికి నాలుగు కిట్లను అందించారు.

ఖాతాలు సేకరించినా..

కరోనా తర్వాత కిట్ల పంపిణీ నిలిచిపోయింది. వాటి స్థానంలో ఒక్కో విద్యార్థినికి నెలకు రూ.100 చొప్పున 10నెలలు రూ.1000 నగదు అందిస్తామని గత ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలో విద్యాశాఖ అధికారులు విద్యార్థుల వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలను సేకరించి ఉన్నతాధికారులు అందజేశారు. గత విద్యా సంవత్సరంతో పాటు ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడిచినా వారికి కాస్మోటిక్ చార్జీలు విడుదల కాలేదు. దీంతో సబ్బులు, కొబ్బరినూనె, పేస్ట్ తదితరాలను కొనుగోలు చేయడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

హుజూర్‌నగర్ : విద్యార్థులు నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) జానపాటి కృష్ణయ్య సూచించారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఆన్ ద జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వర్క్ షాప్‌లను పరిశీలించి మాట్లాడారు. సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని, నైపుణ్యాలు మరింతగా మెరుగు పరుచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బ్రహ్మచారి, శ్రీనివాసరెడ్డి, అరుణ జ్యోతి, రామమూర్తి, నర్సింహారావు, నరసింహ రాజు, గ్రంథపాలకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌ను పరిశీలిస్తున్న డీఐఈఓ

మార్కెట్‌కు స్థలం కొరత

తిరుమలగిరిలో తొమ్మిదిన్నర ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటు

- ఇప్పటికే నాలుగు ఎకరాల్లో గదులు, షెడ్లు, గోదాముల నిర్మాణం
- ధాన్యం అధికంగా వస్తే స్థలం సరిపోక సెలవు ప్రకటించాల్సిన పరిస్థితి
- దీనికి తోడు ఎకరం స్థలంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణంతో సమస్య మరింత జఠిలం



తిరుమలగిరి మార్కెట్‌లో దారిలో పోసిన ధాన్యం



వ్యవసాయ మార్కెట్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మార్కెట్‌ను స్థలం కొరత వేధిస్తోంది. వ్యవసాయ సీజన్లలో ధాన్యం పోటెత్తుతుండడం... ఇప్పటికే స్థలం సరిపోక కాంటాలతో పాటు ఎగుమతులు, దిగుమతులకు సమస్యలు తలెత్తుతుండడం.. వెరసి మార్కెట్‌కు తరచూ సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు కొంత స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. దీంతో రైతులకు ఇక్కట్లు తప్పడంలేదు.

ఒకరోజు నడిస్తే రెండు రోజులు సెలవు

తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ 1973లో సూర్యాపేట మార్కెట్ కింద ఏర్పడింది. 1993లో సూర్యాపేట–జనగామ ప్రధాన రహదారికి సమీపంలో సంత స్థలం పక్కన తొమ్మిదిన్నర ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేశారు. ఇది జిల్లాలోనే రెండవ అతిపెద్ద రెగ్యులేట్ మార్కెట్. ఏడాది పొడవునా ఈ మార్కెట్‌కు ధాన్యం, వేరుశనగ, అపరాలు, మొక్కజొన్నలను రైతులు తీసుకొస్తుంటారు. ఇది దినదినాభివృద్ధి చెందుతుండటంతో ఇందులో మార్కెట్ కార్యాలయం, రైతుల విశ్రాంతి భవనం, ఈనాం కోసం కార్యాలయం నిర్మించారు. వీటితో పాటు గోదాములు, వర్షం వస్తే తడవకుండా ఉండేందుకు 9 షెడ్లను సైతం నిర్మించారు. నాలుగు ఎకరాల్లో గదులు, గోదాములు, షెడ్లు పోను మిగతా ఐదున్నర ఎకరాల్లో ఓపెన్ ప్లాట్ ఫామ్ ఉంది. ప్రతి సీజన్‌లో రోజూ మార్కెట్‌కు 10 వేల నుంచి 30 వేల ధాన్యం బస్తాలతో పాటు ఇతర పంటల క్రయ విక్రయాలు సాగుతుంటాయి. 20 వేల బస్తాల కంటే ధాన్యం ఎక్కువగా వచ్చిన రోజు స్థలం సరిపోక మార్కెట్‌కు ఉన్న రెండు గేట్ల ముందు నుంచి లోపలికి వెళ్లే దారిలో సైతం ఎక్కడ పడితే అక్కడ ధాన్యం రాశులు పోస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు అధికంగా ధాన్యం వస్తుండడంతో ఒకరోజు మార్కెట్ నడిస్తే కాంటాలు, ఎగుమతులు ఆలస్యం అవుతుండటంతో రెండు రోజులు సెలవులు ఇవ్వాల్సి వస్తోంది. మార్కెట్‌లో స్థలం సరిపోక రైతులు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంతో..

తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లోనే మున్సిపాలిటీకి సంబంధించిన వెజ్, నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఎకరం స్థలంలో ఏర్పాటు చేయడానికి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటికే మార్కెట్‌లో స్థలం సరిపోవడం లేదనుకుంటే ఈ మార్కెట్ నిర్మాణం వల్ల ఎకరం స్థలం వృథాగా పోతోంది. దీంతో పది, పదిహేను వేల బస్తాల ధాన్యం పోయడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో వ్యవసాయ మార్కెట్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణలు చేపట్టడం పట్ల రైతులు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ ప్రాంతాలనికి గోదావరి జిలాలు రావడంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురవడంతో నియోజకవర్గంలో అధికంగా పంటలు సాగవుతున్నాయి. దీంతో పాటు తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు యాదాద్రి భువనగిరి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల నుంచి కూడా రోజూ అధికంగా సరుకులు వస్తాయి. సీజన్‌లో కొన్నిసార్లు 30 వేల నుంచి 40 వేల బస్తాల సరుకులు కూడా వస్తుంటాయి. మార్కెట్‌కు అధికంగా సరుకులు వచ్చిన రోజు కాంటాలు, ఎగుమతులు, దిగుమతులు కాక మార్కెట్ యార్డు ఒక్కరోజు నడిస్తే మరో రెండు రోజులు బంద్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు 1993లో అప్పటి పంట ఉత్పత్తులను దృష్టిలో ఉంచుకొని తొమ్మిదిన్నర ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మార్కెట్ యార్డు స్థలం సరి పోవడం లేదు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అధికారులు 20 నుంచి 30 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని రైతులు, వ్యాపారస్తులు కోరుతున్నారు.

ఇబ్బందులు ఏర్పడుతున్నాయి



వ్యవసాయ మార్కెట్‌కు రోజూ అధికంగా ధాన్యం వస్తుండటంతో స్థలం సరిపోక దారిలోనే పోస్తున్నారు. ఉన్న కొద్ది స్థలంలోనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టడం వల్ల ఇంకా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వేరే స్థలంలో నిర్మించాలి.
– వెంకటేశ్వర్లు, కమీషన్‌దారుడు, తిరుమలగిరి మార్కెట్

వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఇక్కడే ఎందుకు



మార్కెట్‌లో ఉన్న స్థలమే సరిపోక సీజన్‌లో సరుకులు పోయడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఈ కొద్ది స్థలంలోనే వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మించడం వల్ల పది పదిహేను బస్తాల ధాన్యం పోయలేక పోతున్నాం. సరుకులు అధికంగా వచ్చిన రోజు రైతులు, వ్యాపారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.
– శర్విరాల సుధాకర్, ట్రేడర్, తిరుమలగిరి.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వేరేచోట నిర్మించాలి



ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను వ్యవసాయ మార్కెట్‌లో కాకుండా వేరేచోట నిర్మిస్తే బాగుంటుంది. వ్యవసాయ మార్కెట్‌కు రోజూ 500 మందికి పైగా రైతులు వస్తారు. వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పూర్తయితే ఇరు మార్కెట్లకు వచ్చే ప్రజలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి.
– రాపాక సోమేష్, వ్యాపారి, తిరుమలగిరి

క్లుప్తంగా

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

వలిగొండ: మండలంలోని ఎదుల్లగూడెం గ్రామానికి చెందిన మునుకుంట్ల బాలమణి కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై బుధవారం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమెకు భర్త, కుమారుడు, కూమార్తె ఉన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రి దహన సంస్కారాలు చేస్తున్న మౌనిక

చిలుకూరు: చిలుకూరు గ్రామానికి చెందిన కొడారు శ్రీనివాస్‌రావు(41) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడికి కుమారులు లేరు. కుమార్తె మౌనిక మాత్రమే సంతానం. కొడుకులు లేకపోవడంతో మౌనిక తన తండ్రి చితికి నిప్పు పెట్టింది. ఈ ఘటనను చూసి పలువురు గ్రామస్తులు కంటతడి పెట్టారు.

వ్యవసాయ బావుల వద్ద ట్రాక్టర్ల అపహరణ

ఆత్మకూరు(ఎం): వ్యవసాయ బావుల వద్ద ఉంచిన ట్రాక్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వివరాలు ఆత్మకూరు(ఎం) మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన తుమ్మల మహేందర్‌రెడ్డి ట్రాక్టర్ ఇంజన్‌తో పాటు లింగరాజుపల్లి గ్రామానికి చెందిన దేశబోయిన శ్రీశైలం ట్రాక్టర్ ట్రాలీని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. దీంతో బాధితులు బుధవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇసుక డంపు సీజ్



ఇసుక డంపును సీజ్ చేస్తున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది

నూతనకల్: మండల పరిధిలోని గుండ్లసింగారం ఆవాసంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును పోలీసులు, రెవెన్యూ సిబ్బంది బుధవారం సీజ్ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లసింగారం గ్రామ శివారులోని పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తోడి మామిడి తోటలో నిల్వ చేశారని వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని సుమారు 80ట్రిప్పుల ఇసుకను నిల్వ చేసినట్లు నిర్ధారించి సీజ్ చేసినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం కేశరాజుపల్లికి చెందిన అల్లం ముత్తయ్య(75) ఈనెల 2న తన మేనకోడలు ఊరైన పేరందే విగూడేనికి ఆటోలో వెళ్తూ చిన్న సూరారం వద్ద దిగాడు. అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా నల్లగొండ నుంచి నకిరేకల్ వైపు వెళ్తున్న బొలేరో వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముత్తయ్య తలకు, రెండు కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి రెండో కుమారుడు అల్లం రామ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సింగం రామ్మూర్తి తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

హుజూర్‌నగర్‌రూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి రోడ్డు పక్కన స్తంభానికి ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామ శివారులో బుధవారం జరిగింది. ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని చింతలబజార్‌కు చెందిన నారంశెట్టి అంజి(42) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి మేళ్లచెర్వులో పని ఉందని తన ఓనర్ మస్తాన్ బైక్‌పై బయల్దేరి వెళ్లాడు. మార్గమధ్యలో వేపలసింగారం గ్రామ శివారులోకి చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కన స్తంభాన్ని ఢీకొట్టడంతో చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అంజి అక్కడికక్కడే మృతిచెందాడు. బుధవారం ఉదయం వేపలసింగారం గ్రామానికి చెందిన రైతు చక్కెర కాశిరెడ్డి తన పొలానికి వెళ్తుండగా రోడ్డు పక్కన చెట్ల పొదల్లో ఉన్న బైక్‌ను గమనించి అక్కడికి వెళ్లి చూడగా అంజి మృతిచెంది ఉండడంతో వెంటనే మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నార్కట్‌పల్లిలో ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు

నార్కట్‌పల్లి: బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు అదుపుతప్పి కిందపడడంతో ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి నార్కట్‌పల్లి–అమ్మనబోలు రోడ్డులో బాజకుంట గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సామ్‌సంగ్ సోబర్(21), పింటు సోబర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాకు చెందిన తాయిలు మంగళవారం రాత్రి బైక్‌పై నార్కట్‌పల్లి నుంచి అమ్మనబోలు వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో బాజకుంట గ్రామ సమీపంలోకి వెళ్లగానే రోడ్డుపై గుంతలు ఉండడంతో బైక్ అదుపుతప్పడంతో ముగ్గురూ కిందపడ్డారు. సామ్‌సంగ్ సోబర్ అక్కడికక్కడే మృతిచెందగా. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వారిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.



హుజూర్‌నగర్ రూరల్: అంజి మృతదేహం

ద్విచక్ర వాహనం పైనుంచి పడి మహిళ..



రజిత (ఫైల్)

కనగల్: ద్విచక్ర వాహనం పైనుంచి కిందపడిన మహిళ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన కనగల్ మండల పరిధిలోని బుడుమర్లపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడుమర్లపల్లి గ్రామానికి చెందిన మొర రజిత(26) పని నిమిత్తం మంగళవారం చండూరు మండలంలోని పుల్లెంల గ్రామానికి వెళ్లింది. పని ముగించుకొని చింతపల్లి మండల కేంద్రానికి చెందిన కొప్పెర మహేష్ ద్విచక్ర వాహనంపై తిరిగి సొంతూరుకు వస్తుండగా కనగల్ మండలం బోయినపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెం వద్ద ద్విచక్ర వాహనం పైనుంచి రోడ్డుపై ఉన్న గుంతలో పడి రజిత తల, మోహానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడపటం వల్లనే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతిరాలికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు.

జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ



బ్రిలియంట్ స్కూల్‌లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణ



ప్రశాంతి స్కూల్‌లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ యాదయ్య

భువనగిరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా నందిగామలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో భువనగిరి పట్టణంలోని శ్రీసాయి ప్రశాంతి హైస్కూల్‌కు చెందిన తొగురు జస్వంత్ శర్మ, వర్షిని అండర్ –12 విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ యాదయ్య అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ పాఠశాల విద్యార్థికి..

భువనగిరి పట్టణంలోని బ్రిలియంట్ హైస్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి టీ. శ్రీరామ్ నందిగామలో నిర్వహించిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాడు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీరామ్‌ను ప్రిన్సిపాల్ నక్క కృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పి. మాధవి, రాణి, ముంతాజ్, అశోక్, మాధవి, రాజు, దీప పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

వలిగొండ: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండలంలోని గోపరాజుపల్లిలో బుధవారం జరిగింది. వివరాలు.. గోపరాజుపల్లికి చెందిన గీత కార్మికుడు పాలకుర్ల ఆనంద్ రోజు మాదిరిగా బుధవారం ఉదయం కల్లు గీసేందుకు గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాచకాల్వ నుంచి వృథాగాపోతున్న వరద నీరు



వృథాగాపోతున్న వరద నీరు

శాలిగౌరారం: మూసీ నది నుంచి రాచకాల్వ ద్వారా శాలిగౌరారం ప్రాజెక్టులోకి వచ్చే వరద నీరు మండలంలోని రామాంజాపురం గ్రామం వద్ద తూము నుంచి వృథాగాపోతుంది. తూముకు ఉన్న షట్టర్ ధ్వంసం కావడంతో నీరు వృథాగాపోతోంది. దీంతో ప్రాజెక్టులోకి వరదనీరు ప్రవాహం తగ్గడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ధ్వసమైన షట్టర్ల స్థానంలో నూతన షట్టర్లను ఏర్పాటు చేసి ప్రాజెక్టులోకి సాగు నీరు వచ్చి చేరేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ధ్వంసమైన షట్టర్ల వద్ద తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ.. రాచకాల్వ వెంట ఉన్న కొంతమంది రైతులు కావాలనే తూముల నుంచి నీరు వృథాగాపోయేలా చేస్తున్నారని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

ఎంజీయూలో ముగిసిన అథ్లెటిక్ పోటీలు



గెలుపొందిన జట్లను అభినందిస్తున్న అధికారులు

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న అథ్లెటిక్ పోటీలు బుధవారం ముగిశాయి. హై జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, పరుగు పందెంతో పాటు మొత్తం 32 అంశాల్లో నిర్వహించిన క్రీడల్లో డిగ్రీ, పీజీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఓవరాల్ చాంపియన్‌గా ఎస్‌ఎల్‌ఎన్ భువనగిరి డిగ్రీ కళాశాల విద్యార్థులు నిలిచారు. వివిధ క్రీడల్లో ప్రతిభచూపిన క్రీడాకారులను అంతర్ యూనివర్సిటీ పోటీలకు పంపనున్నామని ఎంజీయూ క్రీడల విభాగం అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ క్రీడల కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, రమావత్ మురళి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

నేరేడుచర్ల: పట్టణంలోని పినాకిల్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. దూరాలు, కోణాలు, ఎత్తులు తదితరాలను తెలుసుకోవడంతో పాటు విద్యార్థుల్లో పఠనాసక్తి, స్వీయ అనుభవ జ్ఞానాన్ని పెంపొందించడానికి ఈ పర్యటన ఎంతో తోడ్పడుతుందని పినాకిల్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్‌కె మదార్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



క్షేత్రస్థాయి పర్యటనలో భూమి కొలతలను అధ్యయనం చేస్తున్న విద్యార్థులు

డీసీఎంను ఢీకొట్టిన లారీ

అర్వపల్లి: ధాన్యం లోడుతో వెళ్తున్న డీసీఎంను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటన అర్వపల్లి వై జంక్షన్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూర్ నుంచి ధాన్యం లోడుతో నార్కట్‌పల్లిలోని మిల్లుకు వస్తున్న డీసీఎంను సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అర్వపల్లిలోని వై జంక్షన్ వద్ద సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారిపై వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం దెబ్బతినగా డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కపోయాడు. వెంటనే డీసీఎం డ్రైవర్, స్థానికులు కలిసి లారీ డ్రైవర్‌ను బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. డీసీఎంలోని ధాన్యం బస్తాలు కిందపడిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



దెబ్బతిన్న లారీ ముందుభాగం

డిప్యూటీ సీఎంను కలిసిన ట్రెజరీ ఉద్యోగ సంఘం నాయకులు



మల్లు భట్టివిక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రెజరీ ఉద్యోగ సంఘం నాయకులు

రామన్నపేట: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను బుధవారం తెలంగాణ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, రామన్నపేట ఎస్‌టీఓ గంగుల పురుషోత్తంరెడ్డి హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి పరశురాం, కోశాధికారి జగన్, ఉపాధ్యక్షురాలు శిరీష తదితరులు ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

భానుపురి (సూర్యాపేట) : ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని టీఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ కత్తి ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఖమ్మం క్రాస్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ×హలో మాదిగ చలో ఢిల్లీ×కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఈనెల 20న టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు జిల్లా వ్యాప్తంగా 200మంది మాదిగ నాయకులు తరలివెళ్తున్నట్లు వెల్లడించారు. ఈ పార్లమెంట్ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పాతకోట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి వల్దాస్ శంకర్, నాయకులు భాషపంగు సత్యం, నాయకులు ఉపేందర్, కత్తి గురవయ్య, ఒగ్గ రాజు, మేకల శ్యామ్ తదితరులు ఉన్నారు.

'ఆన్ ద జాబ్'ను సద్వినియోగం చేసుకోవాలి

• డీఐఈఓ కృష్ణయ్య

నడిగూడెం : ఆన్ ద జాబ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి జానపాటి కృష్ణయ్య కోరారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్య కోర్సుల విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆన్ ద జాబ్ శిక్షణను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య, అధ్యాపకులు శ్రీధర్, కృష్ణ, మహేష్, వీరన్న, మదార్, నగేష్, ధనుంజయ్ తదితరులు ఉన్నారు.



నడిగూడెంలో ప్రత్యేక శిక్షణను పరిశీలిస్తున్న డీఐఈఓ కృష్ణయ్య

యాసంగి పంటల సాగుపై అవగాహన

ఆత్మకూరు(ఎం): మండలంలోని పల్లెర్ల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యాసంగి సీజన్‌లో పంటల సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరువాక శాస్త్రవేతలు డాక్టర్ అనిల్‌కుమార్, రాజామధుశేఖర్, మమత మాట్లాడుతూ.. యాసంగిలో పంటలు సాగుచేసే పద్ధతి, విత్తన శుద్ధి, చీడపీడల నివారణ తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాయిని నర్సింహారెడ్డి, ఎంపీడీఓ సోలిపురం మల్లారెడ్డి, ఆలేరు ఏడీఏ బి. వెంకటేశ్వరావు, ఏఈఓలు సరిత, క్రాంతి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏరువాక శాస్త్రవేత డాక్టర్ అనిల్‌కుమార్

ఎస్‌జీబీటీ మిత్రుల ఆత్మీయ సమ్మేళనం

నడిగూడెం: మండల కేంద్రంలో 1969–71 సెకండరీ గ్రేడ్ బేసిక్ ట్రైన్డ్ టీచర్స్(ఎస్‌జీబీటీ) బ్యాచ్‌కు చెందిన ఉపాధ్యాయ మిత్రులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు జానిమియా, హమీద్, బండి రామిరెడ్డి, పాపిరెడ్డి, యాదగిరి, సోమయ్య, అనంతరెడ్డి, శశిధర్, తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న రిటైర్డ్ ఉపాధ్యాయులు

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి క్రైం: రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి పట్టణంలోని హుస్నేనాబాద్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణలోని తారకరామనగర్‌కు చెందిన గజ్జల బాలకృష్ణ(40) తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో భువనగిరి పట్టణంలోని హుస్నేనాబాద్ సమీపంలో రైలు పట్టాలపై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు గ్రామీణ కృషి అనుభవం ముఖ్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ డిగ్రీ విద్యార్థులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: వ్యవసాయ డిగ్రీ చదివే విద్యార్థులకు గ్రామీణ కృషి అనుభవం ముఖ్యమని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డి. ఆదర్శ్ అన్నారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ విద్యార్థులు బుధవారం గడ్డిపల్లిని సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు గ్రామస్తులు, రైతులతో మాట్లాడి వ్యవసాయంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు అంజయ్య, రామయ్య, ఉపేంద్ర, శ్రీనివాస్, నాగయ్య, నాగరాజు, నవీన్, పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణతోనే 'మిరప'కు రక్షణ

పెద్దవూర: మిరప పంటలో సస్యరక్షణ పద్ధతులు పాటించి కాపాడుకోవాలని ఉద్యానవన క్లస్టర్ అధికారి మురళి రైతులకు సూచించారు. పత్తి పంటలో పూర్తిగా దిగుబడి తగ్గడం, పెట్టుబడులు వెళ్లే పరిస్థితులు లేకపోవడంతో ఈ ఏడాది జిల్లాలో అధిక విస్తీర్ణంలో మిరప పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పక్వ దశలో ఉంది. అనేక చీడపీడలు వ్యాపించి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. శిలీంద్రాలు, పురుగులు, సూక్ష్మధాతువు లోపాలు ఉన్నట్లు దీనికి తోడు నల్ల తామర పురుగులు వ్యాప్తి ఉంది. కొమ్మ ఎండు, కాయకుళ్లు, బూడిద తెగుళ్లు, కాయతొలిచే పురుగుల వలన పంట నష్టపోయే ప్రమాదం ఉంది. దీంతో నాణ్యత తగ్గి తాలు కాయలు ఏర్పడి మార్కెట్‌లో ఆశించిన మద్దతు ధర లభించదు. తగిన నివారణ చర్యలు చేపడితే రైతులు పంట దిగుబడి పెంచుకోవచ్చునని సూచిస్తున్నారు.

కొమ్మ ఎండు–కాయ కుళ్లు తెగులు..

మిరప పైరు పూత దశ నుంచి కాయ దశకు వచ్చే సమయాల్లో కొమ్మ ఎండు తెగులు, కాయ కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. వీటి కారణంగా కొమ్మ, కాయ మీద బూడిద రంగు మచ్చలు ఏర్పడతాయి. వీటి ప్రభావంతో కొమ్మలు పైనుంచి కింది వరకు ఎండిపోతాయి. కాయ మీద మచ్చలు చిందరవందరగా ఏర్పడతాయి. వీటితో శిలీంధ్ర ఉత్పత్తి కణాలు ఉండటంతో కాయ సహజ రంగును కోల్పోతుంది.



పెద్దవూరలో సాగవుతున్న మిరప

పక్షి కన్ను మచ్చ తెగులు..

తేమతో కూడిన చల్లటి వాతావరణంలో మిరప ఆకులపై సర్కోస్పోరా, ఆల్టర్‌నేరియా మచ్చలు ఆశిస్తాయి. సర్కోస్పోరా ఆశించినట్లయితే పక్షికన్ను ఆకారం గల మచ్చలు ఏర్పడుతాయి. ఈ ప్రభావంతో పంటలో నాణ్యత, రంగు తగ్గుతాయి.

నివారణ చర్యలు..

200 లీటర్ల నీటిలో 200 మి.లీ. ప్రొపికోనజోల్‌ను కలిపి ఎకరం పొలంలో పిచికారీ చేసుకోవాలి. లేదా 100మి.లీ. డైఫెన్‌కొనజోల్‌ను కలిపి పిచికారీ చేయాలి.

పాడి పంట

నివారణ చర్యలు

వీటి నివారణకు ఎకరం పొలానికి 200 లీటర్ల నీటిలో 200 మి.లీ. ప్రొఫికానజోల్, లేదా 100 మి.లీ. డైఫెన్ కొనజోల్, లేదా 200 గ్రాముల పైరాక్సీ స్ట్రోబిన్‌ను కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు..

చలి, తేమ వంటి వాతావరణ మార్పులతో బూడిద తెగులు సోకుతుంది. ఈ తెగులును కలుగజేసే శిలీంధ్రం వలన ఆకు కింది భాగంలో బూడిద రంగులో తెల్లటి పాడి ఏర్పడుతుంది. దీని వలన ఆకు ఆకుపచ్చ రంగును కోల్పోయి పసుపు రంగులోకి మారి రాలిపోతుంది.

నివారణ చర్యలు..

ఎకరాకు 200 లీటర్ల నీటిలో 300 గ్రాముల గంధకం, లేదా 200 మి.లీ. డైనోకాప్, లేదా బెలటాన్, లేదా అజాక్సీస్ట్రోబిన్‌లను కలిపి పిచికారీ చేయాలి. లేదా లీటర్ నీటిలో 200 మి.లీ. ట్రైడిమార్ఫ్ కలిపి పిచికారీ చేయవచ్చు.

జింకు లోపం..

భాస్వరం ఎక్కువగా వాడితే జింకు లోపం కనిపిస్తుంది. ఆకుల కనుపుల మధ్య పసుపుపచ్చ రంగులోకి మారి రాలిపోతుంది.

నివారణ చర్యలు..

జింకులోపం నివారణకు లీటర్ నీటిలో 2 గ్రాముల చీలేటెడ్ జింక్‌ను కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

కాయ తొలిచే పురుగు..

కాయ తొలిచే పురుగు కాయలను రంధ్రం చేసి లోపలి భాగాన్ని తినడం వలన కాయ రాలిపోవడం లేదా కాయ పరిమాణం తగ్గి నాణ్యత, దిగుబడి కోల్పోతుంది.

నివారణ చర్యలు

లీటర్ నీటిలో 1.5 గ్రా. అసిఫేట్, లేదా ఒక మి.లీ. నుపులురాన్, లేదా 0.3 మి.లీ. రైనాక్సీఫైర్ లేదా 0.3 గ్రాముల ఫ్లూబెండమైడ్‌ను కలిపి పిచికారీ చేయాలి.